క్లుప్తంగా

దళితబంధు అమలు చేయాలని బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మానకొండూర్ నియోజకవర్గంలోని దళితులందరికి దళితబంధు పథకం అమలు చేయాలని బీజేపీ నాయకులు బుధవారం ఇల్లంతకుంట అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ ఎన్నికల సమయంలో దళితులందరికీ రూ.10 లక్షలు ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీ ఇప్పటి వరకు అమలు కాలేదని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిడి హరీశ్, స్వామి, రజినీకాంత్, ప్రసన్న, సంతోష్, నవీన్, ప్రశాంత్, కిషన్, శ్రీను, అఖిల్, ప్రశాంత్, చింటు, శ్రీకాంత్, వర్దన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

తంగళ్లపల్లి: స్థానిక పీహెచ్‌సీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 20 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్ రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గుడ్ల రవి, డాక్టర్ రజిత, వైస్ చైర్మన్ పి.వేణుకుమార్, కోశాధికారి శివప్రసాద్, కార్యదర్శి శివ ప్రసాద్, సభ్యులు రాపెల్లి ఆనందం, టీబీ సూపర్‌వైజర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకుంటాం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో పశువులు రోడ్లపై సంచరిస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని రోడ్లపై రాకుండా యజమానులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. మూడు రోజుల్లో పశువులు రోడ్లపైకి రాకుండా చూడాలని లేని యెడల పశువులను స్వాధీనం చేసుకొని యజమానులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్కెట్లో రైతుల కష్టాలు

- ఆదాయం ఉన్నా.. మౌలిక వసతుల్లేవు
- ఇరు మార్కెట్లలో తాగునీటికి తండ్లాట
- మార్కెట్లో తమకు స్థలం కావాలంటున్న రైతులు
- రైతుబజారులో కొనసాగని మాంసం అమ్మకాలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలోని ఇరు మార్కెట్లలో కూరగాయలు అమ్మే రైతులు కష్టాల్లో ఎదురీదుతున్నారు. పాతమార్కెట్‌లో స్థలం లేక, కొత్త మార్కెట్‌లో దళారుల మూలంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రజలకు తాజాగా కూరగాయలు అందించాలన్న ఆశతో నిత్యం మార్కెట్లకు వస్తున్న అన్నదాతలకు అవసోపాలు తప్పడం లేదు. కూరగాయల విక్రయాలకు రైతుల కోసం నిర్మించిన రైతుబజార్, కూరగాయల మార్కెట్లలో రైతుల కష్టాలపై కథనం ఇది.

రైతుబజారులో అవస్థలు ఇవి..

సిరిసిల్ల మానేరు తీరంలో 23 జూన్ 2020న రూ.3.45 కోట్లతో రైతుబజారును ప్రజలు, రైతుల సౌకర్యార్థం ఆధునిక హంగులతో నిర్మించారు. ప్రతిరోజు 100 మందికి పైగా రైతులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇక్కడ కూరగాయలు విక్రయాలు జరుపుతారు. వీరు సేద తీరేందుకు రెస్టు రూములతో పాటు 12 సీట్లతో టాయిలెట్స్, సపరేట్ యూరినల్స్ ఉన్నాయి. కానీ తాగునీరు లేకపోవడంతో రైతులు నీళ్లను కొనుక్కొని తాగుతున్నారు. రైతుబజారు ముందు కొందరు వ్యాపారులు తాము అద్దెకు తీసుకున్న దుకాణాలను వదలి ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయించడం రైతులకు ఇబ్బందిగా ఉంటుంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందినా కూడా పరిస్థితిలో మార్పు రావడం లేదు.



వసతుల లేమితో పాత వెజ్‌మార్కెట్

పాతమార్కెట్లో చోటేది..?

ఇక సిరిసిల్ల నడిబొడ్డున యాభై ఏళ్లుగా ఉంటున్న వెజిటేబుల్ మార్కెట్ పూర్తిగా చిరు, బడా వ్యాపారులకు మాత్రమే చోటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. తమ కోసం ప్రభుత్వం రైతుబజారును కట్టించినా, సాయంత్రం వేళలో ఊరి చివరన ఉన్న రైతుబజారుకు కష్టమర్లు రావడం లేదని ఆరోపిస్తున్నారు. వెజిటేబుల్ మార్కెట్లో చిరు వ్యాపారులు కూడా దశాబ్దాల తరబడిగా ఉపాధి పొందుతున్నారు. ఐతే ఇరువర్గాలకు అధికారులు న్యాయం చేకూర్చడంతో శ్రద్ధ వహించడం లేదు. వెజిటేబుల్ మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్సు నుంచి నెలకు రూ.30 లక్షలు అద్దెలు, తైబజారు లీజు ద్వారా మున్సిపల్‌కు ఆదాయం వస్తుంది. ఇక్కడే ఇరుకు ప్రాంతంలో ఫిష్ మార్కెట్, మాంసం మార్కెట్‌లు నడుస్తున్నాయి. ప్రజలకు ఈ ప్రాంతం సౌకర్యంగా ఉండటంతో ఎక్కువ మంది ఇక్కడే రావడంతో తమకు కూడా చోటు ఇవ్వాలని పది రోజుల క్రితం రైతులు మున్సిపల్ ముందు ధర్నా చేశారు.

సౌకర్యాలు.. ఇబ్బందులు

➡ ఇరు మార్కెట్లలో శానిటేషన్ సౌకర్యాలు బాగానే ఉన్నా.. మౌలిక వసతుల కల్పనలో రైతులు, చిరు వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందిగా ఉంది. కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో నీళ్లకు కొనుక్కోవాల్సి వస్తుంది.

➡ వెజిటేబుల్, రైతు బజారు నుంచి ప్రతిరోజు మున్సిపల్ ఆధ్వర్యంలో రెండు మెట్రిక్ టన్నుల వేస్టేజీను రెండు వాహనాల్లో ఉదయం, సాయంత్రం వేళలో తరలిస్తున్నారు.

➡ మాంసం, చికెన్, ఫిష్ మార్కెట్లు ఏడాదిన్నరగా రైతుబజారుకు తరలడం లేదు. పైగా నిత్యావసరాల దుకాణాలు వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఫలితంగా రైతుబజారుకు అత్యధిక సంఖ్యలో కష్టమర్లు రావడం లేదు.

➡ వెజిటేబుల్ మార్కెట్ ద్వారా మున్సిపాలిటీకి ఏడాదికి రూ.2 కోట్లు వరకు ఆదాయం వస్తున్నా, మంచినీరు, ఇతర మౌలిక వసతులు లేకపోవడం విమర్శలకు తావిస్తుంది.



రైతుబజారులో ఖాళీగా విక్రయ దుకాణాలు

➡ రైతు బజారులో రోజు సుమారు 100 మంది, కూరగాయల మార్కెట్లో సుమారు 230 మంది కూరగాయలు విక్రయిస్తున్నారు. మార్కెట్లకు బల్దియా ఆధునిక హంగులను కల్పించింది.

చోటు కల్పించాలి

మాది తంగళ్లపల్లి. ఉదయం, సాయంత్రం వేళలో ఇంటి వద్ద సాగు చేసే కూరగాయలను తీసుకొచ్చి అమ్ముతుంటాం. ఐతే ఉదయం వేళలో రైతుబజారులో విక్రయిస్తాం. సాయంత్రం వేళలో అక్కడకు ఎవరూ రావడం లేదు. రైతబజారు పూర్తిస్థాయిలో అమ్మకాలు జరిగే వరకు పాత మార్కెట్లో రైతులకు చోటు కల్పించాలి. రోడ్డుపై కూరగాయలు అమ్మడం మాకు ఇష్టం లేదు. – గడ్డం రాజయ్య, రైతు

సకల వసతులున్నాయి

ఇరు మార్కెట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాం. రైతుబజారు, పాతమార్కెట్‌లో నెలకు లక్షల రూపాయలు వెచ్చిస్తూ, శానిటేషన్ పనులు చేపడుతున్నాం. మాంసం, చేపల విక్రయాలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తాం. – వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

సంఘాలు - ఎన్నికలు

యాదవ సంఘం గ్రామ కార్యవర్గం

కోనరావుపేట: మండలం సుద్దాల గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడిగా కుంటెల్లి రాజయ్యయాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కుంటెల్లి రామస్వామి, కార్యదర్శిగా కుంటెల్లి ఎల్లయ్య, కోశాధికారిగా మెండె పెద్దగంగయ్య ఎన్నికయ్యారు.

రైతు సహకార సంక్షేమ సంఘం

కోనరావుపేట: మండలం నాగారంలో రైతు సహకార సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మ్యాకల ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా దుంపెట నాగరాజు, కార్యదర్శిగా సుభి రాములు, సంయుక్త కార్యదర్శిగా అప్పాల భూమయ్య, సహాయకార్యదర్శిగా కొమ్ము చంద్రయ్య, బొమ్మెన భాస్కర్‌రావు, రాములు, బాస జనార్దన్, మల్లయ్య, ఎల్లం, గోపాడి మధుసూదన్‌రావు ఎన్నికయ్యారు.

చర్చి నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు



మంజూరుపత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ అశోక్

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల టీపీటీఎఫ్ అథోనై చర్చి నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు అయినట్లు సర్పంచ్ మాట్ల అశోక్ తెలిపారు. ఈ మంజూరు పత్రాన్ని పాస్టర్ జీవరత్నం, సంఘ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ కృషితో చర్చి నిర్మాణానికి నిధులు వచ్చాయన్నారు. ఉపసర్పంచ్ చంద్రం, వార్డు సభ్యులు శోభ, రాజవ్వ, మల్లేశం, సంఘ సభ్యులు దేవిడ్ దేవయ్య, పోచమల్లు, లింగయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శబరి గిరీశా అయ్యప్ప..



ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం నుంచి రాజుగురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పమాలధారులు బుధవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. 18వ శబరియాత్ర చేస్తున్న నర్సింగరావు, రాంగోపాల్‌తోపాటు 45 మంది మండల దీక్షలు పూర్తి చేసుకుని ఇరుముడులతో స్వాములు తరలివెళ్లారు. రెండు ప్రత్యేక బస్సుల్లో శబరియాత్రకు వెళ్లారు. ఎస్సై వెంకటేశ్వర్లు, గురుస్వాములు వెంకన్న, మేరుగు అంజాగౌడ్, మహేందర్, కృష్ణమూర్తి, శ్రీపాదశర్మ, జగన్, వినయ్, ప్రసాద్ తదితరులున్నారు.

గుణాత్మక విద్యతో చైతన్యవంతమైన సమాజం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

కోనరావుపేట: పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందిస్తే చైతన్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళా ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. క్రమశిక్షణతో సాగి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పాఠశాలలో నిర్వహించిన మేళాలో అనేక రకాల బోధన పరికరాలను ప్రదర్శించారని, ఈ అభ్యాసం సామగ్రితో విద్యార్థులకు సులువుగా విద్య నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, సెస్‌వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేందర్, సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ చారి, నోడల్ అధికారి శారద, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోనరావుపేట: మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్



ఇల్లంతకుంట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి



గంభీరావుపేట: ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో రాధాకిషన్



వేములవాడరూరల్: పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

పట్టుదలతో చదవాలి

ఇల్లంతకుంట: విద్యార్థులు పట్టుదలతో చదివి ముందుకెళ్లాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో మండల స్థాయి టీఎల్‌ఎం మేళా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంఈవో బన్నాజీ, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, గాలిపల్లి సింగిల్‌విండో చైర్మన్ అనంతరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, ఆబీఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మేళాను డీఈవో రాధాకిషన్, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ సందర్శించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో డీఈవో రాధాకిషన్ పాల్గొని మాట్లాడారు. ఈ మేళా ద్వారా పాఠశాలలో బోధిస్తే విద్యార్థుల సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు బహుమతులను, ప్రశాంశ పత్రాలను అందజేశారు.

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట గ్రామంలో టీఎల్‌ఎమ్ మేళా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పాల్గొన్నారు. వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ రెండు మండలాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన సామాగ్రిని ఆమె పరిశీలించి, మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అలరించిన మేళా

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో నిర్వహించిన మేళాలో ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, ఎఫ్‌ఎల్‌ఎస్ నోడల్ అధికారి తోట దివాకర్, హెడ్‌మాస్టర్లు ఎం.ప్రేమలత, రంగనాథశర్మ, మండల స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండ్రోజులపాటు జరిగిన టీఎల్‌ఎమ్ మేళా ముగింపు కార్యక్రమంలో రాంరెడ్డిపల్లె ఉపాధ్యాయురాలు స్రవంతి, కిరణ్, రవీందర్, రమేశ్‌ను సన్మానించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచ్ సుమతి, నోడల్ ఆఫీసర్ విఠల్, హెచ్‌ఎంలు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభ్యసన బోధన సామాగ్రి మేళాను మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు తిలకించారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళాను కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి కమలాకర్ సందర్శించి, ఉపాధ్యాయులను అభినందించారు. నోడల్ అధికారి అనురాధ, ప్రధానోపాధ్యాయులు భాగ్యరేఖ, గోపాల్‌రెడ్డి శ్రీనివాస్, విజయ్‌కుమార్ ఉన్నారు.

నిలిచిన ఆధార్ సేవలు



కోనరావుపేటలో మూసిఉన్న ఆధార్ నమోదు కేంద్రం

- 9 నెలలుగా పనిచేయని ఆధార్ సెంటర్
- 28 గ్రామాల ప్రజల ఇబ్బందులు

కోనరావుపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 9 నెలలుగా కేంద్రం మూసి ఉండడంతో మండల ప్రజలకు ఆధార్ సేవలు అందడం లేదు. కోనరావుపేట మండలంలోని 28 గ్రామాలకు కలిపి ఒకే ఒక్క ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో అన్ని గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు అందుతుండేవి. ఆధార్ నమోదు, చిరునామా, వయస్సు, పేరులో తప్పులు తదితర అన్ని రకాల సేవలు అందుతుండేవి. 2022 మార్చి నుంచి ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తిరిగి వెళుతున్నారు.


ఆధార్ అప్‌డేట్‌పై అవగాహన కరువు

2015 కంటే ముందు ఆధార్ గుర్తింపుకార్డును పొందిన వారు యూఐడీఏఐ ఆదేశాల ప్రకారం సంబంధిత పత్రాలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. 15 ఏళ్ల చిన్నారులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి. ఇందుకోసం సదరు వ్యక్తులు ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాలి. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కూడా లేదు. విషయం తెలుసుకున్న కొంతమంది వెళ్లగా సెంటర్ మూసేసి ఉంటుంది.

9 నెలలుగా తప్పని తిప్పలు

మండలంలో 9 నెలలుగా ఆధార్ సెంటర్ పనిచేయకపోవడంతో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు మారుమూల గ్రామాల నుంచి రావడం, తాళం వేసి ఉండడంతో తిరిగి వెళ్లిపోవడం జరుగుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆధార్ సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఫొటో మార్పు కోసం వచ్చా



మాది కోనరావుపేట మండలం వట్టిమల్ల. ఆధార్ కార్డులో ఫొటోను మార్చుకుందామని పలుమార్లు వచ్చాను. ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. మారుమూల గ్రామాల ప్రజలు రావడానికి పోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలి. – దర్శనాల శేఖర్, వట్టిమల్ల

త్వరలోనే ప్రారంభిస్తాం

కోనరావుపేటలో ఆధార్ సేవలను త్వరలోనే పునరుద్ధరిస్తాం. కొన్ని కారణాలతో ఆధార్ నమోదు కేంద్రంలో ఏడాదిపాటు సేవలు నిలిపివేయడం జరిగింది. అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం. – శ్రీనివాస్, జిల్లా మేనేజర్

మూఢనమ్మకాల పేరుతో మోసం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్సై కిషన్‌రావు

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ఉండే అమాయక ప్రజలను మూఢనమ్మకాల పేరుతో మోసాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏఎస్సై కిషన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో బుధవారం పోలీస్ కళాబృందం సభ్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మారు వేషాల్లో మంత్రాల నెపంతో కొంతమంది గ్రామాలకు వస్తున్నారన్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బూర రాజేశ్వరికి నివాళి

సిరిసిల్లకల్చరల్: అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన కవితల రాజేశ్వరికి సిరిసిల్ల సాహితీ సమితి నివాళులు అర్పించింది. బుధవారం మండెపెల్లిలోని కేసీఆర్ కాలనీలో నిర్వహించిన రాజేశ్వరి పెద్దకర్మకు సమితి ప్రతినిధులు హాజరయ్యారు. కాలివేళ్లతో కన్నీటి వ్యథని అక్షరీకరించిన తీరు అసమానమని సమితి అధ్యక్షుడు పారండ్ల మురళీధర్, డాక్టర్ జనపాల శంకరయ్య అన్నారు. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, మాదిరెడ్డి అంజనాదేవి, ముడారిసాయి మహేశ్, దాసరి రాజేశం పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

తంగళ్లపల్లి: తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 9 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ అధికారి సర్వర్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


వీర్నపల్లి: పీఆర్‌టీయూ–టీఎస్ క్యాలెండర్‌ను డీఈవో రాధాకిషన్ ఆవిష్కరించారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను డీఈవో రాధాకిషన్ ఆవిష్కరించారు.

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో బుధవారం పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ ఆవిష్కరించారు.

కోనరావుపేట: ఎమ్మార్సీలో టీఎస్‌టీటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో దూస రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా మదన్‌లాల్ ఆవిష్కరించారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌నుఆవిష్కరించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

తంగళ్లపల్లి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల ఆవిష్కరించారు. పలువురు పాల్గొన్నారు.

26 నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండల కేంద్రంలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ చారి కోరారు. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయంలో జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రెంజర్ల రాజేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: చదువుల తల్లి సరస్వతీ అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన రెంజర్ల రాజేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట బీజేపీ మండల నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మానుక రాజు, రాజిరెడ్డి, కుమార్, సాయికిరణ్, బాలాగౌడ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ అందజేత

వేములవాడ: టీఎస్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ ఆదేశాలతో రాష్ట్ర టీఎస్జీవోల సంక్షేమం కోసం వేములవాడ రాజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాలు, నూతన క్యాలెండర్‌ను ఆయనకు బుధవారం అందజేసినట్లు ఆలయ పీఆర్‌వో ఉపాధ్యాయుల చంద్రశేఖర్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా : 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899